క్లుప్తంగా

జర్నలిస్ట్ పిల్లలకు నోట్ పుస్తకాల పంపిణీకి శ్రీకారం

ఒంగోలు సెంట్రల్: నగరంలోని ఎస్సీ, ఎస్టీ జర్నలిస్ట్ పిల్లలకు ఎస్సీ, ఎస్టీ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా నోట్ పుస్తకాలు ఇవ్వనున్నట్లు సంఘ కార్యదర్శి వసంత్ తెలిపారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో 5వ తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు చదివే విద్యార్థులకు నోట్ పుస్తకాలు ఇవ్వడానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. అలాంటి పిల్లలున్న జర్నలిస్టులు వారి పేర్లను ఈ నెల 31వ తేదీలోపు నమోదు చేసుకోవాలని కోరారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంఘ బాధ్యులు సూచించారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్లు 91820 95153, 90004 51933లను సంప్రదించాలని కోరారు.

సఖీ సెంటర్ తనిఖీ



సఖీ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి

ఒంగోలు టౌన్: రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి బుధవారం ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలో నిర్వహిస్తున్న సఖీ సెంటర్‌ను తనిఖీ చేశారు. సఖీలో తాత్కాలిక ఆశ్రయం పొందుతున్న బాలికలను పరామర్శించారు. సఖీ సెంటర్‌లో లభిస్తున్న సేవలను ఆరా తీశారు. రిజిస్టర్, వసతులను పరిశీలించారు. జీజీహెచ్‌లో వైద్య సహాయం పొందుతున్న టీనేజ్ గర్భిణిని, బాల్య వివాహం ద్వారా గర్భిణి అయిన బాలికను పరామర్శించిన బాలికల హక్కులకు భంగం కలగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గైనిక్ వార్డు సమీపంలో ఊయలను ఏర్పాటు చేయాలని సూచించారు. మైనర్ గర్భిణులుగా వచ్చినప్పుడు సంబంధిత విభాగాలకు సమాచారం ఇవ్వాలని చెప్పారు. సఖీ సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డా. సురేష్ కుమార్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.దుర్గాదేవి, ఆర్ఎంఓ డా.హనుమంతరావు, శిశు సంక్షేమ శాఖ పీడీ కె.మాధురి, అర్బన్ సీడీపీవో ఫణిరాజ కుమారి, సీడబ్ల్యూసి సభ్యులు డి.వంశీలత, సఖీ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఎస్.జ్యోతి ప్రియ పాల్గొన్నారు.

ఆధార్, పాన్ అనుసంధానం చేసుకోవాలి

దర్శి: ప్రభుత్వ ఆదేశాల మేరకు దర్శి ఉప ఖజానాలోని పెన్షనర్లు ఆధార్ కార్డులు, పాన్ కార్డులను అనుసంధానం చేసుకోవాలని ఉప ఖజానా అధికారి సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 31వ తేదీ లోపు లింక్ చేయించుకోవాలని, లేకుంటే జూన్ నెలలో 20 శాతం ట్యాక్స్ కట్ అవుతుందని చెప్పారు.

లారీ, ట్రక్ ఢీ.. ఇద్దరికి గాయాలు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న రూరల్ ఎస్సై నాయక్

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం నికరంపల్లి గ్రామం వద్ద బుధవారం తెల్లవారుజామున లారీ, మినీ ట్రక్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ కథనం మేరకు.. ఐరన్ లోడ్‌తో కుంట వైపునకు వెళ్తున్న లారీ, ఎదురుగా వస్తున్న మినీ ట్రక్ ఢీకొనడంతో రెండు వాహనాల డ్రైవర్లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను మార్కాపురం జీజీహెచ్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని మార్కాపురం రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తర్లుపాడులో వాహనాల తనిఖీ



తర్లుపాడులో మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో ఎస్సై వేముల సుధాకర్ ఆధ్వర్యంలో బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. తప్పనిసరిగా లైసెన్స్, ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండాలని స్పష్టం చేశారు. పార్కింగ్, ఇతర నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు నేపథ్యంలో గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా నృసింహస్వామి పారాయణం



చీమకుర్తిలో మహాయజ్ఞం కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు



నృసింహస్వామికి హారతిస్తున్న కృష్ణసాయి భట్టాచార్య

చీమకుర్తి: నృసింహస్వామి సహస్రాధిక పారాయణ మహాయజ్ఞ కార్యక్రమాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. నృసింహస్వామి జయంతిని పురస్కరించుకుని చీమకుర్తిలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణం, వాసవీ కల్యాణ మండపాల పరిధిలో టీటీడీ అర్చకులు పరాంకుశం సాయికృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నెల్లూరుకు చెందిన విఖనస సుదర్శ సేవా సమితి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి చీమకుర్తిలోని పలువురు భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. 250 మంది భక్తులతో సామూహిక స్తోత్రపారాయణం నిర్వహించారు. అనంతరం నృసింహ ఆవిర్భావ పుణ్యకాలమున స్వామివారికి విశేష స్నపన తిరుమంజన సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

నగరంలోని వైష్ణవాలయాలలో ఘనంగా నృసింహస్వామి జయంతి వేడుకలు

ఒంగోలు మెట్రో: వైశాఖ మాసం శుద్ధ చతుర్దశి బుధవారం జిల్లావ్యాప్తంగా నృసింహ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. స్థానిక మంగమూరు రోడ్డు అయ్యప్పస్వామి క్షేత్రంలో ఆలయ ప్రధాన అర్చకుడు పరాంకుశం కేశవాచార్యులు ఆధ్వర్యంలో అర్చక స్వాములు రంగస్వామి, చక్రవర్తి, సమీర్ ఉదయం ఏడు గంటలకు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు వివిధ రకాల పూలతో చక్కగా పుష్పాలంకరణ గావించారు. అష్టోత్తర శతనామ పూజ నిర్వహించి ధూప దీప నైవేద్య మంగళ హారతులతో భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. ఒంగోలు కేశవస్వామిపేటలో వెలసిన శ్రీ ప్రసన్నచెన్నకేశవ స్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్లకు ఆలయ అర్చకస్వాములు శ్రీధర్ ఆచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నేత్రోత్సవంగా జరిపించారు. ఈ సందర్భంగా దేవస్థాన సన్నిధిలో శ్రీ లక్ష్మీనరసింహుని విగ్రహానికి జరిపించిన తిరుమంజన మహోత్సవం, లఘు కళ్యాణం నయన మనోహరంగా సాగింది.

కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.రజనీకుమారి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. స్థానిక కొత్తపట్నం బస్టాండ్ నల్లూరి నర్సింగ్ హోమ్ దగ్గర నరసింహస్వామి కళారానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



స్వామివారి తిరుమంజన సేవలో అర్చకులు



పూజలో పాల్గొన్న భక్తులు

ప్రభుత్వ స్థలాల్లో రేకుల షెడ్లు

- ఆక్రమణలతో కుచించుకుపోతున్న కళాశాల భవనాలు
- చోద్యం చూస్తున్న సంబంధిత అధికారులు



ఇటీవల ఏర్పాటు చేసిన పెద్ద పెద్ద బంకులు

కంభం: ప్రభుత్వ స్థలాల్లో ఇష్టానుసారంగా బంకులు, పెద్దపెద్ద రేకుల షెడ్లు ఏర్పాటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోక పోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, తర్లుపాడు రోడ్డులోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ప్రహరీ వెంట సుమారు 50కిపైగా రేకుల షెడ్లతో పలువురు బంకులు ఏర్పాటు చేసుకున్నారు. గతంలో హైవే నిర్మాణంలో భాగంగా రోడ్డు వెంట ఉన్న నాలుగైదు నాయీ బ్రాహ్మణుల బంకులు తొలగించడంతో వారు అధికారుల అనుమతులతో జూనియర్ కళాశాల ప్రహరీకి ఓ వైపున చిన్నపాటి బంకులు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఇదే అదునుగా చూసుకున్న పలువురు వారికి ఇష్టం వచ్చినట్లు పెద్ద పెద్ద సైజుల్లో బంకులు ఏర్పాటు చేసి పెట్టడం మొదలు పెట్టారు. కొందరు వారి సొంత స్థలం అన్న మాదిరిగా పెద్ద రేకుల షెడ్లు వేసి గోడౌన్లకు, ఇతర వ్యాపారాలకు అద్దెలకు ఇస్తున్నారు. గతంలో ఆర్అండ్‌బీ అధికారులకు పలువురు ఫిర్యాదు చేయగా నామమాత్రంగా నోటీసులు ఇచ్చి ఆ తర్వాత చేతులు దులుపుకున్నారు. పెద్ద సైజులో బంకులు ఏర్పాటు చేస్తుండటంతో వెనక ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉన్నత పాఠశాల, డిగ్రీ కళాశాల భవనాలు మూసుకుపోతున్నాయి. దుకాణాల్లోని వ్యర్థాలను సైతం కళాశాల క్రీడామైదానంలో పడేస్తుండటంతో దుర్వాసన వస్తోంది. నివాస గృహాలకు, నూతన గృహాలకు కరెంటు మీటరు కనెక్షను కావాలంటే వంద నిబంధనలు పెట్టే విద్యుత్ శాఖాధికారులు వీరికి మాత్రమే మీటరు కనెక్షన్లు వెంటనే ఇచ్చేస్తున్నారు. బంకులు పెట్టుకొని వ్యాపారాలు సాగించే వారు పంచాయతీ అధికారులకు అద్దె చెల్లిస్తున్నామని చెబుతున్నారు. అద్దె చెల్లిస్తుంటే బంకుల సైజు అన్నీ ఒకేలా ఉండాలి కదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అధికారులకు లంచాలు ఇచ్చి ఎవరిష్టమొచ్చినట్లు వారు షెడ్లు వేసుకుంటున్నారన్న ఆరోపణలు తీవ్రస్థాయిలో వినిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో బంకుల ఏర్పాటు మరింత పెరిగిపోతోందని, ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు స్థానిక ప్రజలు కోరుతున్నారు.



కళాశాల ప్రహరీ వెంట ఏర్పాటు చేసిన బంకులు

విద్యార్థులకు అసౌకర్యంగా ఉంది

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రధాన గేటు, ప్రహరీలను ఆనుకొని బంకులు ఏర్పాటు చేసుకోవడంతో వెనుక ఉన్న కళాశాల భవనాలు మూసుకుపోతున్నాయి. ప్రహరీ వెంట ఉన్న దుకాణాల ముందు ద్విచక్ర వాహనాలు ఉంచడం, యువకులు కూర్చుంటుండటంతో కళాశాలకు వచ్చే విద్యార్థులు, ఉపాధ్యాయినులకు అసౌకర్యంగా ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– మురళి, ఫిజికల్ డైరెక్టర్

రైతు కళ్లలో ఆనందం

- కనిగిరి నియోజకవర్గంలో 189 మంది రైతులకు రూ.14.673 లక్షల పరిహారం
- రైతుకు పెట్టుబడి సాయంగా ఇన్‌పుట్ సబ్సిడీ



దెబ్బతిన్న పంటలు (ఫైల్)

కనిగిరి రూరల్: గతేడాది డిసెంబర్‌లో మిచాంగ్ తుఫాన్ ప్రభావం వల్ల పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంది. ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల ఖాతాల్లో పంట నష్టపరిహార నగదు (ఇన్‌పుట్ సబ్సిడీ) జమ చేశారు. గత ప్రభుత్వాల హయంలో పంటలు సాగుచేసిన రైతులు నష్టపోతే పరిహారం పొందాలంటే కళ్లు కాయలు కాసేలా ఎదురుచూడాల్సి వచ్చేది. వ్యవసాయ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేది. కానీ, ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వ్యవసాయ సిబ్బంది ద్వారా పంట సాగు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు ప్రకృతి విపత్తులు, వైపరీత్యాల వలన నష్టపోయిన రైతులకు సత్వర న్యాయం, ఉపశమనం కలిగించే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక చర్యలు చేపట్టారు.

జిల్లాలో 3,775 మంది రైతులకు రూ.2.82 కోట్లు విడుదల...

జిల్లాలో 1,990 హెక్టార్లలో 8 రకాల పంటలకు నష్టం జరిగింది. వాటికి సంబంధించి 3,775 మంది రైతులకు రూ.2.82 కోట్ల నగదును విడుదల చేయగా, కనిగిరి నియోజకవర్గంలో 87.92 హెక్టార్లకు 189 మంది రైతులకు రూ.14.673 లక్షలు విడుదల చేశారు.

నియోజకవర్గంలో మండలాల వారీగా పరిహారం వివరాలు...

మండలం	హెక్టార్లు	రైతులు	పరిహారం (రూ.లక్షల్లో)
సీఎస్ పురం	50.28	113	8.845
కనిగిరి	5.60	13	0.952
పీసీ పల్లి	2.50	6	0.425
పామూరు	20.80	33	3.326
వెలిగండ్ల	8.74	24	1.486
	87.92	189	14.673

వాస్తవిక దృక్పథంతో రాసిన కావ్యం పాలపిట్ట



పాలపిట్ట పుస్తక పరిచయ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కందుకూరు: ఎటువంటి వక్రీకరణలు లేకుండా సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ నేపథ్యాన్ని తెలియజేయాలనే ఉద్దేశంతోనే పాలపిట్ట దీర్ఘకావ్యం రాశారని రచయిత ముప్పవరపు కిశోర్ అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం పాలపిట్ట దీర్ఘకావ్యం పుస్తక పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలపిట్ట దీర్ఘకావ్యం పుస్తకం సాహిత్య విమర్శకుల ప్రశంసలు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. చారిత్రక నేపథ్యంలో రాసిన ఈ పుస్తకానికి పాఠకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోందని చెప్పారు. ప్రముఖ బుద్ధిస్టు, ఉపాసకుడు గాండ్ల హరిప్రసాద్ మాట్లాడుతూ కందుకూరు సాహిత్య, సాంస్కృతిక, రాజకీయ నేపథ్యాన్ని సవివరంగా ఈ కావ్యంలో రచయిత పొందుపర్చారని, భవిష్యత్ తరాలకు, విద్యార్థులకు ఈ ప్రాంతం తెలుసుకునేందుకు కరదీపికగా పనిచేస్తుందని చెప్పారు. గ్రంథ పాలకురాలు పీ నాగరజని మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా నేటికీ కొనసాగుతున్నాయన్నారు. విద్యార్థులకు వ్యాస రచన పోటీలు, వక్తృత, డ్రాయింగ్ పోటీలు, పుస్తక పరిచయ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీనిలో భాగంగా ఈ ప్రాంత ప్రముఖ కవి, రచయిత ముప్పవరపు కిశోర్ రచించిన పాలపిట్ట దీర్ఘకావ్యం పుస్తక పరిచయ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పుస్తకాన్ని ఆవిష్కరించి విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ అంబేడ్కరిస్టు గేరా చిరంజీవి, లైబ్రరీ కమిటీ సభ్యులు చిల్లర సుబ్బారావు, ఎస్‌కే ఖాదర్‌బాష, పగడాల రోశయ్య, ఎస్‌కే సలోవరు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలు సాధించాలి

- డీఎంహెచ్‌ఓ సురేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ సురేష్ కుమార్

ఒంగోలు టౌన్: ఆర్‌సీహెచ్, పిల్లల ఆరోగ్యం, ఇమ్యూనైజేషన్, టీబీ, లెప్రసీ, ముఖ ఛాయాచిత్రముల హాజరుతో సహా అన్నిరకాల జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై నిర్దేశించిన లక్ష్యాలను ప్రతిఒక్కరూ తప్పనిసరిగా సాధించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సురేష్‌కుమార్ స్పష్టం చేశారు. బుధవారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. నిర్దేశించిన లక్ష్యాలు సాధించని వైద్యాధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గర్భిణులకు సంబంధించిన వివరాలను ప్రతి ఆరోగ్య కార్యకర్త ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రతి గర్భిణికి ఎంసీపీ కార్డు అందజేయాలని, ఆమెకు సంబంధించిన ఆరోగ్య వివరాలను నమోదు చేసిన తర్వాత వైద్యాధికారిచే ధ్రువీకరించాలని చెప్పారు. గర్భిణులకు ప్రభుత్వం అందజేస్తున్న వైద్యసేవలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని, అవసరమైన సలహాలు, సూచనలు అందజేయాలని చెప్పారు. ఎల్‌హెచ్‌సీ అనుమానిత దగ్గుతో బాధపడుతున్న వ్యక్తులకు గళ్ల పరీక్ష చేయించేందుకు తమకు కేటాయించిన లేబొరేటరీలో సంప్రదించాలని ఆశా కార్యకర్తలకు ఆదేశించారు. వైద్యారోగ్య సిబ్బంది సకాలంలో ముఖ ఛాయా చిత్రములను వేయాలని, విధుల పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో డీపీఎం డాక్టర్ వాణిశ్రీ, డీపీహెచ్‌ఎన్‌ఓ సుగుణమ్మ, డీపీఓ సుబ్బలక్ష్మి, పట్టణ ప్రాథమిక కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు.

ఏపీఆర్డీసీ ఫలితాలలో సురేంద్రకు స్టేట్ ర్యాంక్



సురేంద్రను అభినందిస్తున్న శ్రీగురుదత్త విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ (ఏపీఆర్డీసీ) – 2024 పరీక్షలలో ఒంగోలు శ్రీప్రతిభ శ్రీ గురుదత్త విద్యాసంస్థలకు చెందిన గుమ్మా వెంగల సురేంద్రబాబు రాష్ట్ర స్థాయిలో 51వ ర్యాంకు సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సురేంద్రను కాలేజీ ఉపాధ్యాయులు అభినందనలతో ముంచెత్తారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ ప్రతిష్టాత్మక ఏపీఆర్డీసీలో స్థానం సంపాదించిన సురేంద్ర పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. వర్తమాన ప్రపంచంలో జీవితంలో విజయం సాధించాలంటే చదువు ఒక్కటే చక్కటి పరిష్కారమన్నారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని, అప్పుడే మంచి భవిష్యత్తు అనుభవించవచ్చని అన్నారు. ఉపాధ్యాయుల సూచనలు, సలహాల వలనే తాను మంచి ర్యాంక్ సాధించానని సురేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. ఈ అభినందన కార్యక్రమంలో విద్యాసంస్థల వైస్ చైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సీఈఓ నల్లూరి జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు.

జీవాల వ్యాధులకు టీకాలు వేయించాలి



వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశుగణాభివృద్ధిశాఖ అధికారులు, సిబ్బంది

మద్దిపాడు: మండలంలో వర్షాలు పడిన సందర్భంగా జీవాలు, పశువులలో వచ్చే చిటుక, గొంతువాపు వ్యాధులకు ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని జిల్లా పశుసంవర్థకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ రమేష్, జిల్లా పశుగణాభివృద్ధిశాఖ ఉప సంచాలకులు డాక్టర్ షేక్ కాలేషా అన్నారు. బుధవారం మండల కేంద్రమైన మద్దిపాడు సమీపంలోని ఘడియపూడి పునరావాసకాలనీలో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా టీకాలు వేసే కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశుపోషకులు వారి పశువులు, జీవాలకు వ్యాక్సిన్ వేయించుకుని వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడాలని తెలిపారు. ఈ కార్యక్రమం ఈ నెల 22 నుంచి జూన్ 11వ తేదీ వరకూ మండలంలోని ప్రతి గ్రామంలో జరుగుతుందని తెలిపారు. పశుపోషకులు, మేకలు, గొర్రెల పోషకులు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం మొత్తం 250 జీవాలకు వ్యాక్సిన్ అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక పశువైద్యశాల సహాయ సంచాలకులు సుగణ్యారావు, పశుసంవర్థకశాఖ సిబ్బంది, ఏహెచ్ఏలు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల



స్వామి వారి పల్లకిని అగ్గి సేవతో ఊరేగిస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకరణలో స్వామి వారి మూలవిరాట్

గిద్దలూరు రూరల్: పట్టణంలోని కొండ మీద శ్రీలక్ష్మీ నరసింహస్వామి తిరునాళ్ల మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు రేడియో బావి సమీపంలో అభయాంజనేయస్వామి ఆలయం నుంచి స్వామి వారిని అమ్మవార్లతో సహా ప్రత్యేక పల్లకిలో కొండమీద గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు అగ్గి సేవతో ఊరేగింపుగా మోసుకుంటూ తీసుకెళ్లారు. ఆలయంలోని మూలవిరాట్ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని గిరిజానాథస్వామి ఆలయంలో, వేణుగోపాల స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చక స్వాములు నరసింహ స్వామి జయంతి సందర్భంగా నిర్వహించే తిరునాళ్ల మహోత్సవం వైభవం విశిష్టతతో పాటుగా నరసింహస్వామి అవతారం గురించి భక్తులకు వివరించారు. భక్తులు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం చేశారు. 23న విజయవాడకు చెందిన నృత్య కళాకారులతో నృత్య ప్రదర్శన, 24న స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు.

దివ్యాంగ విద్యార్థులపై సర్వే

యర్రగొండపాలెం: ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు పాఠశాలల్లో ప్రవేశాలు కల్పించేందుకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించినట్లు ఎంఈవోలు ఆంజనేయులు, మల్లూనాయక్ బుధవారం తెలిపారు. మండల స్థాయిలో గ్రామాలను రెండు క్లస్టర్లుగా విభజించి సహిత విద్యా రిసోర్స్ పర్సన్‌ల ద్వారా సర్వే చేపట్టామని పేర్కొన్నారు. ఈ సర్వే 40 రోజులపాటు కొనసాగుతోందని, 21 రకాల ప్రత్యేక అవసరాలు గల పిల్లల నమోదు పూర్తి చేస్తామని, ఈ వివరాలను నిర్ణీత ప్రొఫార్మలో ధ్రువీకరించి సమగ్ర శిక్ష కార్యాలయానికి పంపుతామని చెప్పారు. ప్రత్యేక అవసరాల పిల్లలకు రవాణా, ఎస్కార్ట్, రీడర్ చార్జీలు, ఉపకరణాలు, బోధన అభ్యాసన సామగ్రి, ఫిజియోథెరపీ సేవలు ఉచితంగా అందచేస్తారని తెలిపారు.

రేపటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

కొమరోలు: ఇంటర్మీడియెట్ బెటర్‌మెంట్, సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నంద్యాల శ్రీనివాసులు తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం పూట, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం వేళ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు పరీక్ష సమయం కంటే అరగంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు.